సైకిలుకి తాళంవేసి లోపలికి వచ్చిన శ్రీకాంత్‌కి అక్కడ కనబడ్డ దృశ్యం చూడముచ్చటగా ఉంది.

టేబుల్ ఫాన్ తిరుగుతోంది. ఆ ధాటికి ఆగలేక ముంగురులు ఆమె ముఖంతో దోబూచులాడుతున్నాయి. కళ్ళలో వెంట్రుకలు



# ప్రతిబింబం


సింగరాజు రామచంద్రమూర్తి


పడుతున్నా లెక్కచేయకుండా తదేక దీక్షతో చేతిలోని పుస్తకం చదువుతోంది కౌసల్య. బోర్లా పడుకుని, రెండు కాళ్ళూ ఆడించుకుంటూ చదువుతున్న ఆమె అందం అతడిని ముగ్ధుడ్ని చేసింది.

ఒక్క అడుగు ఆమెవైపు వెయబోయి ఆగాడు.

ఆ ఇంటికి పెద్దదిక్కుగా, ఆమెకి అధిపతిగా తన బాధ్యత గుర్తుకొచ్చిందతనికి!

అంత చప్పుడయినా ఆమెకి మనిషి లోపలికి వస్తున్నాడన్న ధ్యాసయినా లేక పోతే ఎలా? తను కనుక సరిపోయింది. ఎవడన్నా దొంగ వస్తే? 'తనామెకు పాఠం నేర్పాలీ రోజు' అనుకుని నేరుగా ఇంటిలోకి వెళ్ళిపోయాడు—దొంగలా మెల్లిగా.

అన్నం పెట్టుకుని తిని, కావాలని చిన్న చిన్న చప్పుళ్ళుకూడా చేశాడు. ఎక్కడా చలనం లేదు కౌసల్యలో! ఇక పాఠం చెప్పవలసిన కాలం ఆసన్న మయిందని ముందు గదిలోకి వచ్చి చిన్నగా దగ్గాడు.

పుస్తకంలోంచి చూపు మారలేదు.

దగ్గరగా వచ్చి "కౌసల్యా" అంటూనే ఎత్తుగా ఉన్న ఆమె వెనక భాగంమీద చిన్నగా చరిచాడు.

పుస్తకంలోంచి తలతిప్పి "మీరా, ఎప్పుడొచ్చారు?" అంది.

"రెండు రోజులయింది." అని మంచంమీద కూర్చున్నాడు.

ఫక్కున నవ్వి గభాలున ఇటు తిరిగి అతని ఒడిలో తలపెట్టుకుని పడుకుంది కౌసల్య. "అప్పటి నుంచి నిలబడే ఉన్నారా!" అనడిగింది నవ్వుతూ.

నీరయిపోయాడు శ్రీకాంత్. "అది కాదు కౌసల్యా ..."

"అబ్బ ఎంత బావుందనుకున్నారు ఈ నవల! నేనిప్పుడు చదువుతున్న సీను చెబితే మీరు కలవుపెట్టి మరీ చదువు తారు."

"తోటలో సెలయేరు ప్రవహిస్తోందిట. ఆ తోటకి యజమాని బాగా చదువుకున్న కుర్రాడు. అందులోకి అందమయిన అమ్మాయి వచ్చింది. సెలయేరు పక్కన పడుకుంది"

"ఆ అమ్మాయి కెక్కడా ఇల్లులేనట్లు అక్కడ పడుకోవడమేమిటీ సిల్లీ!" అన్నాడు శ్రీకాంత్.

"అన్నీ మీకు శంకలే!" అంటూనే నవలలోకి జారిపోయింది.

నిట్టూర్చి మెల్లగా ఆమె తల దిండు మీదకి జరిపి, లేచి నిలబడ్డాడు. "తలుపే సుకో మరి."


"ఒక్క నిముషం. వచ్చేస్తున్నాను. మీరు పదండి" అంది తలెత్తకుండానే. శ్రీకాంత్ బయటికొచ్చి, తలుపు బయట నుంచి లాగి గడియపడేలా చేసి వెళ్ళి పోయాడు.

తరువాత రోజు మధ్యాహ్నం ఆఫీసు నుంచి వస్తూ భయపడ్డాడతను. మళ్ళీ ఎటువంటి దృశ్యం చూడవలసి వస్తుందో నని! కౌసల్యని అతను ఏమీ అనలేదు. ఏరికోరి పెద్దలతో పోట్లాడి, కట్నం లేకుండా చేసుకున్న పిల్ల ఆమె 'ఆమె అందమే వేయి కట్నకానుకల పెట్టు' అనుకున్నాడతను.

తలుపు వేసి ఉండడంతో పెద్దబరువు గుండెలమీదనుంచి దించినట్లయిందతనికి.

తలుపు తీయడమే వెన్నెల విరిసి నట్లుగా నవ్వింది కౌసల్య "చూశారా ఈ

జ్యోతి కథక్కార్టూన్ ప్రతిబింబం




రోజు ఎంత జాగ్రత్తగా ఉన్నానో - కాని ఒక రిక్వెస్టు!" అంది.

"చెప్పు" అన్నాడు శ్రీకాంత్ బూట్లు విప్పుకుంటూ.

సాయంత్రం సినిమా రిలీజవుతోంది. మహిళామండలి వాళ్లు బెనిఫిట్ షో కింద టికట్లు అంటగట్టారు - మనిద్దరికీ తీసుకున్నాను."

"సరే, అలాగే!"

"అయితే - ఈనవల చదివేసి, సినిమా ఎలా తీశారో ఎక్కడెక్కడ మార్చారో చూడాలి! అందువలన ఈ నవల మా ప్రియంవద దగ్గర సంపాయించాను. అదీ ఎక్కడో అడుక్కొచ్చిందిట! నేను చదివాక వాళ్ళ ఆంటీ ఒకావిడ చదవాలిట ఇదంతా సాయంత్రానికి కయిపోవాలన్న మాట!"


"ఇంతకీ ఏమిటంటావు!"

"నేనీ నవల మరో గంటలో వాళ్ళకిచ్చేస్తానని తెచ్చానుగదా .మీరు అన్నం పెట్టుకుని — అన్ని రెడీగా పెట్టేశాను కంచంతో సహా—ప్లీజ్" అంది.

నవ్వాడు శ్రీకాంత్ "ఇంతే కదా! అలాగే దానికింత చెప్పాలా. అయితే సాయంత్రం పిక్చర్‌కి నేను రాలేకపోవచ్చును." అన్నాడు బెరుగ్గా. అయితే ఆ మాటకి కౌసల్య ముఖం విప్పారడం అతన్ని కొంచెం బాధపెట్టింది.

"పోన్లెండి, వర్రీ కాకండి. నేనూ వాళ్ళతో కలిసి వెడితే హాయిగా చర్చించుకుంటూ చూడవచ్చును. ఎంత బావుందంటారు నవల. సినిమా ఎలా తీశారో ఏమిటో—ఏ మాత్రం మార్చినా పాడయిపోతుంది" మంచం మీదికి వాలి పుస్తకంలోకి జారిపోయింది.

శ్రీకాంత్ వంటింటిలోకి వెళ్ళాడు -



అక్కడి దృశ్యం చూసి అతను తెల్ల బోయాడు.

పాలు స్టవ్‌మీద పెట్టినట్లుంది కౌసల్య- అవన్నీ పొంగి నేలమీద ప్రవహిస్తున్నాయి. ఆ ప్రవాహానికి స్టవ్ ఆరిపోవడం అదృష్టం.

"కౌసల్యా" అని ఒక్క అరపు అరిచి అంతలోనే సర్దుకుని "కౌసల్యా" అని సౌమ్యంగా పిలుస్తూ ముందు గదిలోకి వెళ్లాడు శ్రీకాంత్. "పా లు పొం గి పోయాయి చూడలేదూ?" అన్నాడు.

"అయ్యో, ఎప్పుడూ?" అంది.

"కనీసం పాలు పొంగిన వాసనయినా వేయలేదా?" బాధగా అడిగాడు.

"ఈ నవల కోసం నే వెళ్ళినప్పుడు పొంగి ఉంటాయి—ఇదయి పోగానే నేను కడిగి బాగు చేస్తాలెండి" అంటూనే చదవడంలో నిమగ్నురాలయింది.

మరు రోజు శ్రీకాంత్ ఇంటి కొచ్చే సరికి మహిళా మండలి సర్వ సభ్య సమావేశంలా ఉంది ఇంట్లో! .వాకిట్లోనే నిల బడి పోయాడు. అతన్ని చూసి సభలోని కొంచెం పెద్ద తరహా వాళ్ళు—పరాయి మగాడి ఎదుట అలానే కూర్చుండిపోవడం సభ్యత కాదన్న అభిప్రాయం ఇంకా కల వాళ్ళు—లేవబోయారు.

"ఫరవాలేదు పిన్నిగారు కూర్చోండి—మా వారే!" అంటూ సర్ది బయటికొచ్చింది కౌసల్య.

"'మా వార'యితే మగాడు కాదంటావా?" అడిగాడు శ్రీకాంత్.

ఫక్కున నవ్వింది. "కాదంటే నేనూరుకుంటానా? .. ఒక్క రోజుకి అలా సందులోంచి ఇంట్లోకి వెళ్ళండి—మంచివారు కదూ!" అంది.

"అ లా గే లే" అంటూ వెళ్ళాడు

శ్రీకాంత. నలుగురితో పరిచయాలు పెంచుకుని కాలక్షేపం అయేలా చూసుకోవడం అతని కిష్టమే కాని ఇది కొంచెం మితిమీరి నట్లనిపించింది!

మొత్తానికి కాపరం పెట్టిన నెలరోజుల కల్లా అత నొక కార్యక్రమానికి అలవాటు పడిపోయాడు. ఉదయాన్నే లేవడం చిన్న తనం నుంచీ అలవాటు కనుక—బాయిలర్ అంటించడం కూడా కొత్తగా అలవాటు చేసుకున్నాడు. ఆ చేత్తోనే తలుపు తీస్తే పనిమనిషి అంట్లు తీసుకుపోయి తోమి మళ్ళీ లోపల పెట్టేస్తుంది. మధ్యాహ్నం అన్నీ సిద్ధంగా పెడితే అతనే అన్నం పెట్టుకుని తినేస్తున్నాడు. మధ్య మధ్య కౌసల్య నలుగురితో కలిసి సినిమాకివెళ్ళిన రోజున—మళ్ళీ వచ్చి ఇబ్బంది పడడం దేనికని అతనే అన్నం కూడా పడేస్తాడు! "ఎందుకండి, నే వచ్చి పడేద్దును కదా!" అని కౌలస్య అంటుందేమోనని మొదట ఆశ పడ్డాడు. కాని ఆమె ఆ మాట అనక పోవడంతో దానికి అలవాటు పడ్డాడు.

సాయంత్రం తరువాత తన కోసం ఎదురు చూస్తుండేది గాని మధ్యాహ్నం పూట అభిమాన రచయిత్రుల నవలల మధ్యనో, చుట్టుపక్కల ఆడవాళ్ళ మధ్యనో ఉంటుండే కౌసల్య తనకి దూరం అయిపో తున్నట్లు బాధ పడసాగా డతను. అధవా ఎప్పుడన్నా దగ్గరసా వెడదామన్నా, చుట్టూ ఉన్న పుస్తకాల్లోంచి రచయిత్రులు తన్ని చూస్తున్నట్లు ఇబ్బందిగా అనిపించే దతనికి!

దేనికయినా ప్రత్యక్షానుభవం కావా లన్న నమ్మకం గలవాడు శ్రీకాంత్. పది మాటలు చెప్పేకన్న ఒక్కసారి చూపిస్తే మనస్సుకి తెలికగా హత్తుకుంటుందన్నది అతని సిద్ధాంతం.

అందుకే ఒక రోజు మధ్యాహ్నం ఇంటికి వస్తూనే "వారం రోజులు శలవు పెట్టాను కౌసల్యా, సాయంత్రం మనం మీ ఊరు వెడుతున్నాం" అన్నాడు.

పుస్తకంలోంచి తలెత్తి "మా ఊరా?" అంది కౌసల్య.

"అవునోయ్—మీ అమ్మగా రింటికి! రెడీగా ఉండు. టికట్లు రిజర్వ్ చేయించాను కూడా" అన్నాడు.

ఛంగున లేచింది మంచం మీదనుంచి కౌసల్య.

కౌసల్యని కాపరానికి తెచ్చుకున్న తరువాత అత్తవారింటికి రావడం అదే అతనికి ప్రథమం. అక్కడి వాతావరణం, పద్ధతులూ అతనికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగించాయి. అత్తగారిని గురించి తన తల్లి వాళ్ళు చెప్పింది వినడమేగాని ప్రత్యక్షంగా వాళ్ళ దిన చర్య చూడడం అతని కదే ప్రథమం.

అందుకే అతనికి చాలా ఆనందం వేసింది—ఆశ్చర్యమూ వేసింది. రెండు రోజుల పాటు హోరా హోరీగా నిద్ర పోయిన కౌసల్య బద్ధకంగా పడుకొని ఉన్నప్పుడు దగ్గర చేరి అన్నాడు శ్రీకాంత్ "కౌసల్యా, బద్ధకంతీరిందా?" అని.

"ఊఁ" అంది నవ్వుతూ.

"మనింట్లో అంత అలిసిపోయావా?"

"ఊఁ" అంది నవ్వుతూనే.

మనస్సు చివుక్కుమంది శ్రీకాంత్‌కి. "కొంచెం ముఖ్యమయిన విషయాలు మాట్లాడుతున్నాను విను" అన్నాడు.

మత్తుగా అతని ఒడిలోకి తల జరుపు

కుని పడుకుంది కౌసల్య అయినా చలించ లేదు శ్రీకాంత్—డ్యూటీ ఫస్టనుకున్నాడు

"ఇక్కడికి వచ్చిన రెండు రోజులుగా నేను ఉదయాన్నే లేస్తున్నాను నీకా విషయం తెలియదనుకో: అప్పటినుంచి మీ ఇంటి పద్ధతులు చూస్తున్నాను ముఖ్యంగా మీ అమ్మగార్ని గమనిస్తున్నాను ఆవిడ చాలా కష్ట పడుతోంది ఇంటి గురించి" అన్నాడు

"అవును పాపం" అంది కౌసల్య

"ఉదయాన్నే అయిదింటికి లేస్తారావిడ అప్పటినుంచి క్షణం కూడా తీరిక ఉండదు మీ నాన్నగారు ఏడు గంటలకి లేస్తారు ఆయనకి ఒళ్ళు వంగదనుకుంటా ఆవిడే ఆయనకి బ్రష్ మీద పేస్టు వేయాలి చెంబుతో నీళ్ళివ్వాలి-ముఖానికి అదయ్యే సరికి కాఫీ అందించుతుంది ఆ తరువాత ఆయన సిగిరెట్టు వెలిగించుకునేందుకు అగ్గిపెట్టె, బకెట్టుతో నీళ్ళు తరువాత బాత్ రూం నీళ్ళు—ఆ వేడినీళ్ళు ఏ మాత్రం వేడిగా ఉన్నా ఆయన "సరుసూ" అని పిలుస్తారు తప్ప పక్కన ఉన్న చన్నీళ్ళు చెంబుడు అందులో పోసుకోరు టవలు అందించాలి పూజకి అన్నీ సిద్ధంచేయాలి భోజనం చేసినంతసేపు దగ్గిరుండాలి ఆవిడ తరువాత ఆవిడే బూట్లు వేస్తుంది "

పకపక నవ్వింది కౌసల్య "మీరు వచ్చి రెండు రోజులయింది నేను ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు ఉన్నా నంటారు ఇక్కడ?" అంది

"కరెక్ట్ మరి బాధ పడబోకు నేనడిగే దానికి మీ అమ్మగారు అండగా భర్తకి సేవలుచేసే పూర్వకాలపు పతివ్రతలాంటిది కదా, నువ్వామెని అనుసరించకుండా "

మధ్యలోనే అందుకుని "మా అమ్మే నాకు గురువు కాదని ఎవరన్నారు?" నవ్వుతూ అంది కౌసల్య

ఆశ్చర్యపడ్డాడు శ్రీకాంత్ "గురువా?"

"అవున్నా మా అమ్మే నాకు గురువు ఆవిడనే నా మనస్సులో పెట్టుకుంటాను" అని ఆగి "అద్దంలో ప్రతిబింబం ఎలా ఉంటుంది?" అనడిగింది శ్రీకాంత్ని

"అచ్చం వస్తువులానే ఉంటుంది "

"అంతేనా—మరి ఫిజిక్స్ లెక్చెరరు గారు తమరు" అంది నవ్వుతూ

"ఆఁ ఆఁ కుడి ఎడమగా మారుతుంది ప్రతిబింబంలో" అన్నాడు నవ్వుతూ శ్రీకాంత్

"అవునా—నేనూ మా అమ్మకి అంతే. ఎలా ఉండకూడదో నేర్చుకున్నాను మా అమ్మ దగ్గర. మరీ సేవలు చేసి మగవాడిని పాడు చేశారు అమ్మలాంటి వాళ్ళు నా అదృష్టం నా భావాలకి తగ్గట్టు వచ్చారు మీరు" అని నవ్వి "ఇక పాతివ్రత్యం మాటంటారా—'రాజశేఖరం' లాటి మీరుండగా నా పాతివ్రత్యాని కేం లోటండి బాబూ" అంది

మాట్లాడలేక పోయాడు శ్రీకాంత్ ఆమెని ఏమీ అనలేడు—అంత ఇష్టం అతనికి కౌసల్య అంటే అయితే అతని కొచ్చిన ఊహ ఒక్కటే—తన కూతురు మళ్ళీ కౌసల్యకి ప్రతిబింబం అవుతే—

